**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 15.05.2026** **సమయం: 13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
2. నీట్ యూజీ 2026 పరీక్షను జూన్ 21న తిరిగి నిర్వహించనున్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు.
3. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అంబర్ పేట నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి, పలు వైద్య పరికరాలను అందజేశారు.
4. పేదలకు ఎయిమ్స్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం టిమ్స్ ఆసుపత్రులను రూపకల్పన చేసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు వెల్లడించారు.
5. తెలంగాణలో రాబోయే మూడు రోజుల పాటు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, మరోవైపు, గరిష్ట ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల వరకు పెరగవచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది.

.....................................................

**పొన్నం ప్రభాకర్**

రాష్ట్రంలోని కుల కార్పొరేషన్లకు త్వరలోనే నిధులు కేటాయించి, వారి విధులపై స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్‌లో పెరిక కుల కార్పొరేషన్ చైర్మన్, వైస్ చైర్మన్ల పదవీ బాధ్యతల స్వీకార ఉత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేని

విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని, వీటి ద్వారా సంక్షేమ కార్యక్రమాలు అమలవుతాయని తెలిపారు. పెరిక కులస్తులు నిర్మించుకుంటున్న ఆత్మగౌరవ భవనానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

.....డెస్క్

**REV. PRADHAN-BRIEFING**

విద్యార్థుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని పేర్కొంటూ, వచ్చే నెల **21న** నీట్ యూజీ రీ-ఎగ్జామినేషన్ నిర్వహించనున్నట్లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. అభ్యర్థులు వచ్చే నెల 14 నుండి తమ అడ్మిట్ కార్డులను పొందవచ్చని అన్నారు. పరీక్షా విధానంలో పారదర్శకత కోసం వచ్చే ఏడాది నుండి OMR స్థానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానాన్ని ప్రవేశపెడతామని తెలిపారు.

**బైట్ ... ప్రధాన్**

NTA లో సంస్కరణలు చేపట్టి, విద్యా మాఫియా కుట్రలను అరికడతామని హామీ ఇచ్చారు. అర్హులైన విద్యార్థులకు అన్యాయం జరగకుండా పరీక్షా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

...NSD

**కిషన్ రెడ్డి**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అంబర్‌పేట్ నియోజకవర్గంలోని కాచిగూడ, బాగ్ అంబర్‌పేట్ డివిజన్లలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. అక్కడ ఉన్న సిబ్బందిని కేంద్రాలలో అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రాలలో ఆరోగ్య సేవలను పొందే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో పలురకాల వైద్య పరికరాలను అందజేశారు.

**....డెస్క్**

**రామచందర్ రావు**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన ఆర్థిక స్వావలంబన, బాధ్యతాయుత వనరుల వినియోగ పిలుపుకు అనుగుణంగా, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు జూబ్లీ హిల్స్‌లోని కార్యక్రమానికి హాజరయ్యేందుకు మెట్రోలో ప్రయాణించారు. రామచందర్ రావు తార్నాక మెట్రో స్టేషన్ నుంచి మెట్రో ఎక్కి జూబ్లీ హిల్స్‌కు బయలుదేరారు. అనవసర ఇంధన వినియోగాన్ని తగ్గించడం బాధ్యతాయుతమైన పద్ధతులను అవలంబించడం కోసం దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన సప్త సూత్రాలను పాటించాలని ప్రజలకు రామచందర్ రావు విజ్ఞప్తి చేశారు.

....డెస్క్

**ఇంటర్**

ఈరోజు తెలంగాణ ఇంటర్ మొదటి సంవత్సరం మ్యాథమెటిక్స్ పేపర్ 1ఏ, బోటని పేపర్ -1, పొలిటికల్ సైన్స్ పేపర్ -1 పరీక్షకు సెట్ – ఎ ప్రశ్నాపత్రాన్ని బోర్డు ఖరారు చేసిందని టీజీబీఐఈ కార్యదర్శి తెలిపారు. పరీక్ష సాఫీ జరిగేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

.......డెస్క్

**కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

రాష్ట్రంలో అత్యధికంగా నల్గొండ జిల్లాలో 5 లక్షల 46 వేల ఎకరాల్లో 14 లక్షల 65 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం పండిందని, ఇప్పటి వరకు 7 లక్షల 24 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో 456 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభి, 53,611 మంది రైతులకు మద్దతు ధర చెల్లించి, 692 కోట్ల రూపాయల రైతుల ఖాతాలో జమ చేశామని, మరో రెండు, మూడు రోజుల్లో మరో 400 కోట్లు రైతుల ఖాతాలలో జమ చేయనున్నట్లు వెల్లడించారు.

......పిటిసి, నల్గొండ

**కేటీఆర్‌కు నోటీసులు**

ఫార్ములా–ఈ రేస్ నిధుల మళ్లింపు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నాంపల్లి ఏసీబీ కోర్టు నిన్న నోటీసులు జారీ చేసింది. ఏసీబీ దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం, నిందితులుగా పేర్కొన్న కేటీఆర్, ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్‌రెడ్డి లను జూలై 31న కోర్టులో హాజరుకావాలని ఆదేశించింది. హెచ్ఎండీఏకు చెందిన 55 కోట్ల రూపాయల నిధులను నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థలకు మళ్లించినట్లు ఏసీబీ అభియోగాలు మోపింది. ఈ విచారణలో భాగంగా వెయ్యికి పైగా కీలక పత్రాలను కోర్టుకు సమర్పించారు. డాక్యుమెంట్ల పరిశీలన అనంతరం న్యాయస్థానం ఈ కేసు విచారణను చేపట్టనుంది. ఇందుకు సంబంధించి ఇతర సంస్థలను కూడా నిందితులుగా చేర్చారు.

.....డెస్క్

**PETROL-DIESEL-HIKE**

దేశ వ్యాప్తంగా లీటరు పెట్రోల్, డీజిల్‌పై సగటున 3 రూపాయలు పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు ఇవాళ ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర 110 రూపాయల 78 పైసలకు చేరింది. ఇక డీజిల్ 98 రూపాయల 90 పైసలకు పెరిగింది.

.....NSD

**రాజ్‌నాథ్ సింగ్**

ఆంధ్రప్రదేశ్ లోని శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 15 వేల 803 కోట్ల రూపాయలతో చేపట్టనున్న అడ్వాన్స్ డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. దీనివల్ల 7 వేల 500 మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు తెలిపారు. డ్రోన్

సిటీలోని ఇతర రక్షణ ప్రాజెక్టులను ప్రారంభించిన వీరు, అక్కడ ఏర్పాటు చేసిన ఆధునిక రక్షణ ఉత్పత్తుల ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు.

.....NSD

**టిమ్స్ ఆసుపత్రి సందర్శన**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి సనత్ నగర్ టిమ్స్ ఆసుపత్రిని సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం కేటీర్ మీడియాతో మాట్లాడుతూ... పేదలకు ఎయిమ్స్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం 1,200 వందల కోట్ల రూపాయలతో ఈ అత్యాధునిక ఆసుపత్రిని రూపకల్పన చేసిందని తెలిపారు. 300 ఐసీయూ బెడ్లు, 16 ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నస్టిక్ సౌకర్యాలతో అంతర్జాతీయ ప్రమాణాలతో దీనిని నిర్మించామని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వం ఉండి ఉంటే రెండేళ్ల క్రితమే ఇది పూర్తయ్యేదని వ్యాఖ్యానిస్తూ, ప్రస్తుత ప్రభుత్వం మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ చుట్టూ టిమ్స్ హాస్పిటల్స్ నిర్మాణం పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడానికేనని ఆయన స్పష్టం చేశారు.

....డెస్క్

**మ్యాంగో మేళా**

కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయ అనుబంధమైన సంగారెడ్డి మామిడి ఫల పరిశోధన స్థానం డైమండ్ జూబిలీ వేడుకలను, మ్యాంగో మేళాను రేపు ఉదయం ప్రారంభిస్తున్నారు. మే 16, 17 తేదీలలో రెండు రోజుల పాటు మామిడి ప్రదర్శన ఉంటుంది. వివిధ మామిడి పళ్ళ రకాలు, అధిక ఫల సాయం అందజేసే మొక్కలు, మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. రైతులు, శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశాన్ని పొందుతూ, మామిడి సాగులో కొత్త సాంకేతికతలు, ఆవిష్కరణల గురించి తెలుసుకోవచ్చు. ఈ రెండు రోజుల కార్యక్రమంలో రైతులు తమ వద్ద

ఉన్న ప్రత్యేకమైన లేదా కొత్త మామిడి రకాలను ప్రదర్శించవచ్చు. అదేవిధంగా, మామిడి పండ్లతో తయారు చేసిన ప్రాసెస్డ్ ఉత్పత్తులను కూడా ప్రదర్శించవచ్చు. అదేవిధంగా మార్కెటింగ్ అవకాశాలు, ఎగుమతులపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. మామిడి ప్రేమికులందరూ ఈ కార్యక్రమానికి హాజరై, విభిన్న రకాల మామిడి పండ్ల ప్రదర్శనను ఆస్వాదించవలసిందిగా కోరుతున్నారు.

......పిటిసి, సంగారెడ్డి

**వాతావరణం**

తెలంగాణలో రాబోయే మూడు రోజుల పాటు అక్కడక్కడా తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్ తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. మరోవైపు, గరిష్ట ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల వరకు పెరగవచ్చని, ఆదిలాబాద్, నిర్మల్ వంటి జిల్లాల్లో వడగాలులు వీచే ప్రమాదం ఉందని పేర్కొంది.

....ప్రెస్ నోట్

**జనగణన నల్గొండ**

నల్గొండ జిల్లాలో జరుగుతున్న జనగణన ఇంటింటి సర్వేకు ప్రజలందరూ సహకరించి సర్వేలో పాల్గొనాలని కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. ఈ ఉదయం తన నివాసంలో జనగణన ఎన్యూమరేటర్ వద్ద సెల్ఫ్ ఎన్రోల్ మెంట్ ఐడి ద్వారా జనగణన చేసుకున్న అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ....

**బైట్ ... బి చంద్రశేఖర్**

......పిటిసి, నల్గొండ

**పశువుల అక్రమ రవాణా**

పశువుల అక్రమ రవాణా పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం నేరమని అసిఫాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ నితిక పంత్ హెచ్చరించారు. గో రక్షణ కమిటీతో నిర్వహించిన

సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ... అక్రమ రవాణాను గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సరిహద్దుల్లో 14 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, పశువుల వధకు వ్యతిరేకంగా అధికారులు చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు.

.....పిటిసి, ఆసిఫాబాద్

**వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కి అర్బన్ చాలెంజ్ ఫండ్**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అర్బన్ చాలెంజ్ ఫండ్లో వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు చేరింది. ఇటీవల గ్రేటర్ కౌన్సిల్ ఆమోదించిన 5257 కోట్ల ప్రతిపాదనలు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు పంపించడంతో యు సి ఎఫ్ లో వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చేర్చేందుకు కేంద్రం అంగీకరించినట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన హన్మకొండ కలెక్టర్, గ్రేటర్ వరంగల్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయ్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పథకం అమలు చేయడానికి రంగం సిద్ధమైందని, నిధుల పైన స్పష్టత వచ్చిందని పేర్కొన్నారు. త్వరలోనే అధికారిక ఉత్తర్వులు జారీ చేస్తారని తెలిపారు.

.....వరంగల్ జిల్లా పి టి సి

**ఇంటర్ - ప్రాక్టికల్స్**

ఇంటర్ విద్యా విధానంలో బోర్డు కీలక మార్పులు చేపట్టింది. 2026-27 విద్యాసంవత్సరం నుండి ప్రథమ సంవత్సరంలోనే ప్రయోగ పరీక్షలను ప్రవేశపెడుతోంది. దీని ప్రకారం ఫస్టియర్, సెకండియర్లలో చెరో 15 మార్కులను ప్రాక్టికల్స్ కు కేటాయించనున్నారు. ప్రస్తుతానికి ఈ సంస్కరణలు మొదటి ఏడాది విద్యార్థులకే వర్తిస్తాయని, 2027-28 నుండి ద్వితీయ సంవత్సరానికి అమలు చేస్తామని బోర్డు స్పష్టం చేసింది.

.....డెస్క్